


# ఎర్రగులాబి

డా॥ వాసా ప్రభావతి

నీరెండ వచ్చి ఆ ఇంటి ముందున్న పచ్చని చెట్లమీద వాలి గిలిగింతలు పెడుతోంది.

చల్లని గాలి తరంగమొకటి వచ్చి మెట్లమీద నిలబడి చూస్తున్న శిల్పను వాటేసుకుంది. శిల్పశరీరంలో సన్నని గగుర్పాటు, హృదయంలో ఏదో తెలియని కొత్త త్రుళ్ళింత.

ఎదురుగా గాలికి అటు ఇటు ఊగుతున్న ఎర్రగులాబి చిరునవ్వుతో శిల్పను పలకరించి నట్లనిపించింది.

"పొద్దుటనగా వికసించి ఆరిపోతున్న దీపంలా ఉన్న గులాబీకి ఒక మహాత్మునిలా ఆ చిరునవ్వు ఎందుకో? తన స్వల్పకాల జీవితంలో తన ఆనందాన్ని, పరిమళాన్ని లోకానికి పంచి తెల్లారి రేకులు రాల్చేస్తుంది. ఆకాస్త వ్యవధిలో అన్ని పూవుల లో తానై బతుకుతుంది. మనిషి అలా బతక లేడెందుకో? బతకాలని ఉన్నా మనసు సుఖంగా బతకనివ్వదు. ఆగులాబీకి లేని మనసు ఈ మనిషికెందుకో? అడుగడుగునా తృప్తి, అసంతృప్తుల మధ్య తులాభారాలు?" శిల్ప మనస్సులో విరిగిపడి లేచే తరంగాల్లా కోటి ఆలోచనలు.

"అమ్మా! శిల్పా!" అత్తగారి పిలుపు బడిగంటలా వినపడింది.

శిల్పా ఉలిక్కిపడి లోపలికి నడిచింది.

"అత్తయ్యా! పిలిచారా ?"

"అవునమ్మా! అలా ఎంతసేపని నిలబడతావు? శేఖర్ వచ్చేవేళయింది. వెళ్ళి బట్టలు మార్చుకో! ఈరోజు సినిమాకు తీసుకెడతానన్నాడుగా?"

"ఇలా ఎన్నో సార్లన్నాడు. ఒక్కరోజూ అన్న టైముకి ఇంటికిరాడు ఈరోజు నమ్మకంలేదు." శిల్పమాటలు మనస్సులోనే ఉండిపోయాయి. తల్లిలా ఆదరించే అత్తగారు రాధాదేవితో ఆమాటలు అనలేకపోయింది.

"అలాగే అత్తయ్యా!" శిల్ప తనగది వైపునడిచింది.

శిల్ప ముఖం కడుక్కుని పౌడరు రాసుకుంది. నుదుట ఎర్రని బొట్టు పెట్టుకుంది. తనకు నచ్చిన చీర కట్టుకుని అద్దం ముందు నిలబడింది.

"దేవకన్యలా మెరిసిపోతూ ఉంటావు. మహారాణీలా నీ జీవితం కాలుకింద పెట్టకుండా సాగిపోతుంది."

అందరూ ఒకనాడు అన్నమాటలు శిల్ప చెవుల్లో రింగుమన్నాయి.

"కానీ నా కళ్ళకింద అప్పుడే నల్లని చారలు! నాబతుకు అప్పుడే పొగచూరిన గాజు చిమ్నీలా మసిబారుతోంది." విశాలమైన శిల్ప కళ్లు నీళ్లతో నిండాయి. అద్దంలో ఆమె ముఖం ఆమెకే కనబడలేదు. గుండె మోయలేనంత బరువైంది. నిలబడలేక వెళ్లి సోఫాలో వాలింది.

"అమ్మా ! శిల్పా!"

ఆ పిలుపు వినగానే శిల్ప కన్నీళ్ళు తుడుచుకుంది. చన్నీళ్ళతో తిరిగి ముఖం కడుక్కుని బొట్టు పెట్టుకుని బయటకు వచ్చింది. పాలరాతి శిల్పంలా నడచివస్తున్న శిల్పను రాధాదేవి కళ్ళార్పకుండా చూసింది. శిల్పముఖంలో నీలి నీడలు కొట్టవచ్చినట్టు కనబడుతున్నాయి.

"బృందావనంలో ప్రియుని వెంట హాయిగా తిరగవలసిన నిన్ను తెచ్చి కారడవిలో పడేసాను. జంటను చేసాను గాని జీవితంలో జంటగా నడిపించలేక పోతున్నాను. ఈ పాపం నాదేనమ్మా!'' రాధాదేవి మనసు విలవిల్లాడింది. అంతలో కాలింగ్ బెల్లు మోగింది.

"శిల్పా! తలుపు తీసి చూడమ్మా !"

రాధాదేవి మాట పూర్తికాకుండానే శిల్ప వీధి తలుపుతీసింది. ఎదురుగా రఘు నిలబడి ఉన్నాడు.

"శిల్పా ! బాగున్నావా?"

ఆకంఠంలో ఏదో ఆప్యాయత, ఆమాటల్లో హృదయాన్ని తడిపే ఏదో మాధుర్యం. నిండిన శిల్ప హృదయంలో అవి పన్నీటి జల్లుల్లా కురిసాయి.

బాగున్నానని చెప్పలేని శిల్ప తలాడించింది.

రఘు చొరవగా లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

శిల్ప అపరాధిలా అతని వైపు చూడలేక పోయింది.

"ఇతను రఘు అత్తయ్యా!"

"అలాగా! రఘు అంటే మీవూరు అబ్బాయే కదూ!"

"అవునత్తయ్యా!"

"ఈవిడ మా అత్తగారు"

"నమస్కారమండీ" రఘూ రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

"రఘూ లేకుండా శిల్ప పెళ్లైపోతోంది. ఈ సంగతి తెలిస్తే అతను ఎంత బాధపడతాడో?" పెళ్లిలో శిల్ప స్నేహితురాళ్ళు అనుకున్న మాటలు రాధాదేవికి గుర్తుకొచ్చాయి.

"ఇప్పుడితడెందుకు వచ్చాడో?" ఆవిడ అంతరాత్మలో ఏదో అనుమానం.

"శిల్పా! నువ్వు మాట్లాడుతూండమ్మా! నే టీ పట్టుకొస్తాను."

రాధాదేవి టీ తేవడానికి వంటింట్లోకి వెళ్ళింది.

రఘు ఇల్లంతా ఒక్కసారి కలియచూశాడు.

"శిల్పా! మూగనోము పట్టావా? మాట్లాడవేం? నీవీణానాదంతో ఈ ఇల్లంతా ప్రతిధ్వనిస్తూ ఉంటుందనుకున్నాను. నీ చిత్రాలలోతో ఈ గోడలన్నీ కలకలలాడు తాయనుకున్నాను." రఘు చెప్పడం ఆపి శిల్పవైపు పరిశీలనగా చూశాడు. మబ్బులు కమ్మిన ఆకాశంలో మరుగున పడిన చంద్రునిలా శిల్ప ముఖం కనబడింది. రఘు కొంతవరకు పరిస్థితిని అర్థంచేసుకున్నాడు. అతని మనస్సు విలవిల్లాడింది.

"టీ తీసుకోబాబు! శిల్పా! నువ్వు కూడా తీసుకో!"

రాధాదేవి టీ అందించింది.

"శిల్పావాళ్ల నాన్నగారూ, అమ్మగారూ అందరూ బాగున్నారా బాబూ!"

"నేను కలకత్తాలో వుంటున్నానండీ! అక్కడి సంగతులు నాకూ ఏమీ తెలీవండీ! శిల్పను ఒక్కసారి చూసిపోదామని వచ్చాను. అన్నట్టు శేఖర్ ఎప్పుడొస్తాడండీ!"

చనువుగా మాట్లాడుతున్న రఘుని రాధాదేవి ఆశ్చర్యంగా చూసింది.

"శేఖర్ వచ్చేటప్పటికి ఆలస్యమవుతుంది బాబూ! నువ్వు భోజనం చేద్దువుగానిలే"


"ఇప్పుడే కదండీ టీ తాగాను. భోజనానికేమి లెండి మళ్లీవచ్చినప్పుడు చేస్తాను. పనుందండీ! నే వెళ్లిపోవాలి. శిల్ప మీ చల్లని నీడలో సుఖంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఈమాటన్నందుకు ఏమీ అనుకోకండి. నమస్కారమండీ!"

రఘువీధి వైపు అడుగులు వేశాడు. అతని కళ్ళల్లో కదలిన నీటిచార రాధాదేవి కంటపడింది.

"రఘు ఉన్నంతసేపు ఏదో తెలియని ఆనందం. అది తిరిగి అతని వెంటేవెళ్లిపోయింది.' శిల్ప మనస్సు అంతకంటే ఆలోచించలేక పోయింది. ఆమె రెండు కళ్లు నీళ్లతో నిండాయి. అక్కడ నిల బడలేక గదిలోకి వెళ్లి మంచంమీద వాలిపోయింది.

"శిల్ప అతని వెంటే ప్రయాణమౌతుందని ఎంతభయపడ్డానో" రాధాదేవి ఊపిరి పీల్చుకుంది.

"రఘు కనబడితే నాబాధలన్నీ చెప్పాలను కున్నాను. కాని అత్తింట్లో బందీగా ఉన్న నేను అత్తగారి ఎదుటే ఏంచెప్పుకోగలను. అయినా చెప్పుకున్నంతమాత్రాన ఏం ప్రయోజనం ఉండదని తెలుసు. ఎవరి కష్టాలు, ఎవరి కన్నీళ్ళు వారివే! ఎవరి జీవితం వారే చక్కదిద్దుకోవాలి. ఈ అవమానాలు, తిరస్కారాలు నేనింకభరించలేను. నాఓర్పు నన్నేవెక్కిరిస్తోంది. హృదయంలేని ఈ శేఖర్‌తో నేనింక కాపురం చెయ్యలేను." చివరకు శిల్ప దు:ఖం ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చింది.



**నాకూ అంతే!**

"నీకు ఎక్కువగా ఎవరంటే ఇష్టం?" అడిగింది రమణి.

"మా ఆయనంటే." చెప్పింది రవళి.

"నాకూ అంతే!" అంది రమణి సిగ్గుపడుతూ.

".....!?"

ప్రతాప వెంకట సుబ్బారాయుడు
(హైదరాబాదు)

కట్టలు తెంచుకు వచ్చిన వరద నీరంతా సముద్రంలో కలిసిన తరువాత నది ప్రశాంతంగా ప్రవహిస్తుంది.

పొంగివచ్చిన దు:ఖమంతా బయటకు వచ్చి శిల్పకాస్తకుదుట పడింది. గతం ఆమె కళ్ళ ముందు నిలబడింది.

శిల్ప బి.ఏ మొదటి తరగతిలో పాసయింది. శిల్పకాలేజికి వెళ్లి మార్కులు తీసుకుంది. బస్సు స్టాపుకువచ్చి నిలబడింది. ఎంతసేపయినా బస్సు రాలేదు. శిల్ప చికాగ్గా అటు ఇటు చూస్తోంది.

"హలో శిల్పా! కన్‌గ్రాట్యులేషన్స్!" రఘుతన చేతిలో ఉన్నఎర్రగులాబీని శిల్పకు అందించాడు.

శిల్ప చిరునవ్వుతో గులాబీని అందుకుంది. శిల్పరోజా గులాబీలు చూస్తూనేఉంటుంది. ఆమెకంటికి ఆ పువ్వు మరీ అందంగా కనబడింది.

"ఏ వస్తువు ఎక్కడుంటే అందమో అక్కడికే చేరుతుంది. ఈగులాబీ మీ చేతుల్లో ఎంత అందంగా ఉందో చూశారా!"

రఘు మాటలకి శిల్పపకపకా నవ్వింది. ఆమె బుగ్గలు ఎర్రగులాబీలయ్యాయి. ఆమెను చూసిన రఘు హృదయం ఎర్రగులాబీ అయింది. అంతలో బస్సు రావడంతో శిల్ప అటుకదిలింది.

"శిల్పా! నాకుద్యోగం దొరికింది. మద్రాసు వెళ్ళిపోతున్నాను. నీతో ఒక్కమాట చెప్పాలని వచ్చాను."

ఇంట్లో ఒంటరిగా ఉందని తెలుసుకున్న రఘు చొరవగా వెళ్లి శిల్పను అడిగాడు.

అతనిని చూడగానే శిల్ప ముఖం వికసించింది. ఏమిటో చెప్పమన్నట్లుగా అతని వైపు చూసింది.

"నేను ఉద్యోగంలో చేరి త్వరలోనే తిరిగి వస్తాను. అప్పటి వరకు నువ్వు నాకోసం ......."

అతని మాట పూర్తికాలేదు. ఎవరో లోపలికి వచ్చారు.

"టా! టా!" రఘూ చెయ్యి ఊపుతూ వెళ్ళిపోయాడు.

"రఘూ! ఏం చెప్పాలనుకున్నాడో? నేను కూడా ఎన్నో చెప్పాలనుకున్నాను. కాని చెప్పలేకపోయాను." శిల్ప పదేపదే అనుకుంది.

ఆరోజు శిల్ప అక్కపెళ్ళి. మగ పెళ్ళి వారి తరపున రాధాదేవి పెళ్ళికి వచ్చింది. బాపూ బొమ్మలా అందంగా ఉన్న శిల్ప అటు ఇటు తిరుగుతుంటే ఆవిడ ఆసక్తిగా చూసింది. "ఈ అమ్మాయి నాకోడలయితే శేఖర్ తిన్నబడతాడు. బయటతిరుగుళ్ళు మానేసి యింటిపట్టున ఉంటాడు." రాధాదేవి అనుకున్నట్టుగానే శేఖర్‌ని పిలిచి శిల్పను చూపించింది.

దాంపత్య జీవితం పై ఏ ఆశయంలేని శేఖర్ ఆమె అందం తన సొంతం కావాలనుకున్నాడు. శిల్పను పెళ్ళిచేసుకోవడానికి అంగీకరించాడు.

అప్పుడే వికసించి పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తున్న శిల్ప హృదయంలో రఘురూపం చిత్రించబడింది. చేతి వేళ్ళతో వీణతంత్రులు మీటిరాగాలు పలికించే ఆమె హృదయమే వీస్తూ అతని జ్ఞాపకాలలో రాగాలు పలుకుతోంది. శిల్ప లేత హృదయం రఘు కోసం తపిస్తోంది. శిల్ప పెళ్ళి చేసుకోనని మొండి పట్టుపట్టింది. ఇంట్లో ఎవరూ ఆమె మాట వినిపించుకోలేదు.

పెద్దింటికి వెడుతోందని తండ్రికి సంబరం. కావలసిన నగలు, బట్టలు, లంకంత కొంపాఉన్నాయని తల్లి అక్క చెల్లెళ్లకు సంబరం. పెళ్ళికి ముహూర్తం పెట్టేశారు.

అప్పట్లో శిల్పకు ఇల్లువదలి పారిపోయేటంత ధైర్యంలేదు. ఆత్మహత్యచేసు కునేటంత సాహసమూ లేదు. రఘుకి తెలిస్తే రెక్కలు కట్టుకువాలేవాడు. అతనికి తెలియజేయడానికి శిల్పకు ఎడ్రస్సే తెలీదు. ఎవరూ తన బాధను పంచుకునేవారు లేక ఒంటరిగా బాధపడింది.

పెళ్ళిపనులు సందడిగా ప్రారంభమయ్యాయి. కాలమేగాయం మాన్పినట్లుగా పెళ్ళి సందడిలో పడింది. శిల్పక్రమంగా రఘు సంగతి మరిచిపోసాగింది.

అనుకున్నట్టుగానే శిల్ప, శేఖరుల పెళ్ళి వైభవంగా జరిగింది. శిల్ప అత్తవారింట్లో అడుగుపెట్టింది.

ఆరాత్రి కొత్తదంపతులకు మొదటి రాత్రి. రెండు మనసులూ, రెండు తనువులు ఒక్కటయ్యే రాత్రి. శిల్ప గుండె వేగంగా కొట్టుకోడం మొదలు పెట్టింది. సన్నని శరీరం లేతీగలా అల్లాడిపోసాగింది.

పన్నీటిస్నానం చేయించి తెల్లని పాలనురుగు లాంటి చీరకట్టించారు. ఘుమఘుమలాడే అత్తరు పూసి పూలమాలలు తలనిండా తురిమారు. అడుగులు తడబడుతుంటే నడవలేని శిల్పను బలవంతంగా గదిలోకి పంపారు. భయంతో చేతులు వణుకుతుంటే శేఖర్‌కి పాలగ్లాసు అందించింది. అతనివైపు సూటిగా చూడలేక అరమోడ్పు కన్నులతో నిలబడింది.

"లైట్ టార్పు" శేఖరు గొంతు ఖంగుమంది.

ఉలిక్కిపడి శిల్ప కళ్ళు తెరచింది. భయంతో గజగజలాడింది. నిలబడలేక గోడను ఆనుకుంది.

శేఖర్ ఆమెవైపు గుడ్లురిమి చూసాడు. లైటార్పి ఆమె చెయ్యిపట్టుకుని మంచంవైపు లాక్కువెళ్ళాడు.

"అక్క, పిన్ని చెవిలో గుసగుసలాడిన వన్నీ అబద్ధాలేనా!"

శిల్ప మనస్సు చిన్నబోయింది. ఆమె ఎదురు చూసిన ఆనందమంతా కరిగి కన్నీరై కారింది. అయినా తలుపు తీసుకుని బయటకు రాలేకపోయింది.

ఆ చీకట్లో శేఖర్ ఆమె శరీరాన్ని ఆక్రమించుకున్నాడు. ఆమెకాదనలేకపోయింది. సున్నితమైన ఆమె పెదాలు, బుగ్గలు కొరికిగాట్లు చేశాడు. ఆమె అంగీకారంలేకుండానే ఆమె వక్షస్థలంమీద చేతులు వేశాడు. ఆమె అంగీకారం లేకుండానే ఆమెను పూర్తిగా ఆక్రమించుకున్నాడు. ఆమెను లాలించ లేదు. తీయని మాటలతో కవ్వించలేదు. ఆత్మీయతను పంచలేదు. అయినా వయసులో ఉన్న ఆమె శరీరం నలిగి, నలిగి నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారింది మొదలు శిల్ప శరీరంలో ఏదో తడబాటు. శేఖర్ ఒంటరిగా కలిసి పలకరిస్తాడనే ఆశ. కొంగుపట్టిలాగుతాడేమోనని కోరిక. ఆమెను నిలవనియ్యలేదు.

"అమ్మా! శిల్పా! అబ్బాయికి కాఫీ ఇచ్చి రామ్మా!"

శిల్ప అత్తగారి చేతిలోని కాఫీకప్పు అందుకుని గదిలోకి అడుగువేసింది. శేఖర్ తలయెత్తి చూడ లేదు. పలకరించలేదు. ఆమె ఉత్సాహం సగం నీరుకారిపోయింది. అయినా శిల్ప చిరునవ్వుతో కాఫీ కప్పు అందించింది. అతను అందుకోలేదు.

"అలాపెట్టు" ఆగొంతు ఉరిమినట్టుగా ఉంది.

ఉరుము ఉరిమితే కడిమి వికసిస్తుందంటారు. కాని ఈకడిమి వడలి ముడుచుకుపోయింది. శిల్ప చిన్న పిల్లలా రెండు చేతులతో కారే కన్నీళ్ళు తుడుచుకుంది.

"ప్రేమగా దగ్గరకు పిలిచి శేఖర్ ఈ కన్నీళ్ళు తుడిస్తే ఎంత బాగుంటుంది! ఆ సుఖం మరే వస్తువు అందించగలదు! శేఖర్ బిగి కౌగిలిలో నన్ను బంధించి ఉక్కిరి బిక్కిరి చేస్తే నా కింతకంటే ఏం కావాలి? అతడు లాలనగా నా వీపు నిమురుతుంటే విశాలమైన అతని వక్షస్థలంమీద వాలి అతని హృదయంలో తలదాచుకోవడం కంటే నాకు అదృష్టమేముంటుంది!" శిల్ప కోరిక జీవితాంతం కోరికగానే మిగిలిపోయింది.

"శేఖర్ సరసుడు కాడు. కఠినుడు" శిల్ప అంతరాత్మ ఘోషించింది.

"తానేమి తప్పుచేశానని తనకీశిక్ష" శిల్ప కుమిలి కుమిలి ఏడ్చింది. ఆకాశంలో హాయిగా ఎగిరే రామచిలుకను తెచ్చి పంజరంలో బంధించినట్లు బాధపడింది.

"అమ్మా! శిల్పా! ఒక్కసారి వీణ వాయించమ్మా! నాకు వీణంటే చాలా ఇష్టం. నాకు రాక పోయినా నువ్వు వాయిస్తుంటే ఆనందించాలనే నిన్ను నాకోడలిగా తెచ్చుకున్నానమ్మా! ఈ ఇంటి కోడలివైనా కూతురివైనా, నీవేనమ్మా!"

ఓ రోజు రాధాదేవి కోడలిని అడిగింది.

వీణవాయిస్తున్న శిల్ప అత్తగారి కంటికి అపర సరస్వతిలా కనబడింది.

రాధాదేవి నిజంగా బృందావనంలోని రాధై తన్మయత్వం పొందింది.


శేఖర్ రాక ఇద్దరూ గమనించలేదు.

"ఏమిటీగోల? ఈ ఇంట్లో ఇలాటివి పనికిరావని ముందే చెప్పాను. ఒకసారి చెబితే బుద్ధిరాదను కుంటాను."

శేఖర్ ఎడమకాలితో వీణ తన్నుకుంటూ వెళ్ళిపోయాడు.

"అమ్మా! శిల్పా! నన్ను క్షమించమ్మా! శేఖర్ మనిషి కాదు కర్కోటకుడు. వీడు మారడమ్మా! మారడు." రాధాదేవి హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోయింది.

శిల్ప కళ్ళు తిరిగి అచేతనంగా నేలవాలింది.




రాధాదేవి ఆమె ముఖంమీద నీళ్ళు జల్లి తుడిచింది. శిల్ప కళ్ళు తెరవగానే వేడివేడి పాలు తాగించింది.

రాధాదేవి చల్లని సన్నిధిలో శిల్ప సేదతీర్చు కుంది. శిల్పమరెప్పుడూ వీణను తాకలేకపోయింది.

రాధాదేవి కూడా మరెప్పుడూ వీణ వాయించమని అడగలేదు. కొడుకు ప్రవర్తన ఆమెను మరింత కుంగదీసింది. ఆమె ఆరోగ్యం రోజు రోజుకూ దిగజారడం మొదలుపెట్టింది.

గతం నుంచి బయటకు వచ్చిన శిల్ప భయంతో వణికింది. తానొక అగాధంలో కూరుకుపోయానని బాధపడింది. భవిష్యత్తేమిటో ఊహించుకోలేక ఉక్కిరిబిక్కిరయిపోయింది.

"ఇలా గతం తలుచుకుంటూ కూర్చుంటే కాలమేతెలీదు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆవిడను మరింత బాధపెట్టకూడదు. ," శిల్ప బయటకు వచ్చింది.

"అత్తయ్యా! అన్నం తింటారా? వడ్డించనా?'

"జ్వరం తగిలినట్టుందమ్మా! నేను భోజనం చెయ్యను. నువ్వు వడ్డించుకోమ్మా ! "

"ఇదేమిటత్తయ్యా! ఒళ్ళు ఇంత వేడిగా ఉందేమిటి?"

శిల్ప అత్తగారి ఒంటిమీద చెయ్యివేసి చూసి కంగారుపడింది.

"పోయేవయస్సేకాని వచ్చే వయస్సుకాదు కదమ్మా! ఏదో ఒకటి వస్తూనే ఉంటుందమ్మా! అంత కంగారు దేనికి? ముందు నువ్వు భోం చేయమ్మా !"

"మానసిక బాధలతోపాటు శారీరక బాధలెలా తుట్టుకుంటావత్తయ్యా! పెరుగుతున్న వైద్య విజ్ఞానమంతా రోగాలు తగ్గటానికే కదా! మానసిక వ్యాధులకే మందులులేవత్తయ్యా!"

"ఏ వ్యాధులకైనా మందులున్నప్పుడు మానసిక వ్యాధులకు కూడా మందులుంటాయి. ఆ మందులు వైద్యుడుకాదు ఇచ్చేది! మనమే కనిపెట్టుకోవాలి! సమస్యలతో కుమిలి పోవడం కాదు. సమస్యని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. ప్రయత్నం మానవధర్మం. అది మర్చిపోకూడదు శిల్పా !"

అత్తగారి మాటలు జాగ్రత్తగా విన్న శిల్ప ఆశ్చర్యపోయింది.

"ఈసందేశం నాకేనేమో? ఆవిడ ఆలోచనల ముందు నేనెంత?" మనస్సులోనే ఆవిడను అభినందించింది.

అత్తగారికి మందులు వేసి పడుకోబెట్టింది. అప్పటికీ శేఖర్ ఇంటికిరాలేదు. శిల్ప పట్టెడు అన్నం కంచంలో పెట్టుకుంది. ముద్దగొంతు దిగకపోయినా మింగింది. వంటిల్లు సద్దింది. అత్తగారిని మరోసారి పలకరించి గదిలోకి వెళ్ళి పడుకుంది.

శిల్ప మనస్సు చుట్టూ ఆలోచనలు జోరీగల్లా మూగాయి. 'శేఖర్‌కి హృదయంలేదు. అంటే శేఖర్ మనిషికాడు. మనిషి కాని శేఖర్‌తో తానింక కలిసి కాపురం చెయ్యలేదు. ఈ మంగళసూత్రాలు,

మూడు ముళ్ళు శారీరక బంధాలు. ఇవి స్త్రీ పురుషులు కలిసి జీవించడానికి లైసెన్సులేకాని కలిసికాపురాలు చేయించలేవు. మనసులు కలిస్తేనే మనువవుతుంది. లేనినాడు అదిరాతిబొమ్మల పెళ్లే ఈ బంధాలకు దూరంగా వెళ్లిపోవాలి" శిల్ప మనస్సులో చెలరేగిన మనస్తాపం కాస్తకుదుట పడింది.

"అత్తగారికి జ్వరం తగ్గగానే ఒక నిర్ణయం తీసుకోవాలి" ఆలోచనలతో అలసిన శిల్ప నిద్రలోకి జారింది.

నాలుగురోజుల్లో రాధాదేవి జ్వరం తగ్గి మామూలు స్థితికి వచ్చింది. ఆనాలుగురోజులు శిల్ప ఆవిడపక్కనే ఉండి సేవలు చేసింది. ఆనాలుగురోజులూ శేఖర్ ఇంటికి రాలేదు. శిల్ప తిరిగి ఆలోచించడం మొదలుపెట్టింది.

"అత్తగారు తనని చూసి స్వార్థపరురాలను కుంటుందేమో? నేను లేకపోతే ఆవిడ ఒంటరిగా ఎలాబతుకుతుంది? అయినా జీవితంలో తానెవరో? ఆవిడెవరో? నేను జీవితాంతం ఆవిడ వెంటే ఉంటానని వాగ్దానం చెయ్యలేదు. ఆవిడదారి ఆవిడ వెతుక్కుంటూ నాకు పెళ్లి చేసింది. అంతా మోసం, దగా, నటన, నాదారి నేను వెతుక్కుంటూ వెళ్లిపోవాలి. శేఖర్ రాకుండానే ఇల్లు వదలాలి. రఘుని వెతుక్కుంటూ వెళ్లి పోవాలి."

శిల్ప కంగారుగా బట్టలు సద్దుకుంది. తనదంటూ ఏదీ వదలలేదు. అన్నీ పెట్టెలలో పడేసుకుంది. మోయలేనంత బరువుగా ఉన్నా రెండు పెట్టెలు చేతపట్టుకుని బయటకు వచ్చింది.

ఎదురుగా సోఫాలో అత్తగారు కనబడగానే శిల్పగతుక్కుమంది. తప్పుచేసి పట్టుబడిన దానిలా నీరుకారిపోయింది. తలవంచుకుని అక్కడే నిలబడింది.

"ఈవిడ అత్తగారా? అందరిలా సాధించదు. నిందించదు. ఆవలిస్తే పేగులు లెక్కపెడుతుంది.' శిల్ప బోనులో పడ్డ ఎలకలా తప్పించుకోవడానికి గింజుకుంది.

"శిల్పా! నువ్వు తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. కాని కొన్నాళ్ళు భర్తతో కాపురం చేసిన నిన్ను ఆ రఘు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాడా అమ్మా! చాటువ్యవహారానికైతే ఫరవాలేదుకాని ఏలుకోవడానికి ముందుకువచ్చే మగవాళ్ళెంత మంది ఉంటారు? రఘూకి అంత విశాలహృదయ ముంటే అంతకంటే ఏంకావాలమ్మా! అయినా ఒక్కమాట ముందే చెప్పివుంటే పసుపు కుంకుమ లిచ్చి పంపించేదాన్ని కదా? ఏదైనా మంచి సాహసమే చేశావు? డ్రైవరుకి చెబుతాను. ఎక్కడికి వెళ్ళాలో బయలుదేరు!" రాధాదేవి సోఫాలోంచి లేచింది.

"శిల్పా! ఏమయింది నీకు ?" కళ్ళు తిరిగి పడిపోతున్న శిల్పను రాధాదేవి వెళ్ళిపట్టుకుంది.

ఆవిడ కేకలకు లోపలికి పరుగెత్తుకువచ్చిన డ్రైవరు సహాయంతో శిల్పను మెల్లగా సోఫాలో పడుకోపెట్టింది,



**ధైర్యం**

"ఏంటో చిత్రంగా మా వారు చిన్న చిన్న విషయాలకి భయపడ్తారు. పెద్ద విషయాల దగ్గర ధైర్యంగా ఉంటారు."

"ఏం జరిగింది?"

"మొన్న కటిక చీకటిలో భయపడకుండా ధైర్యంగా ఆత్మహత్య చేస్కోటానికి వెళ్లారు... కాని చలికి భయపడి గోదాట్లో దూకటం మానేసి వెనక్కి వచ్చేశారు."

**పి.సరోజ**
(అమలాపురం)

"శిల్ప మనస్సును ఎంతగా నొప్పించానో?" రాధాదేవి ఓపక్క బాధపడుతూనే డాక్టరుకి ఫోనుచేసింది.

లేడీ డాక్టరు వచ్చి పరీక్ష చేసింది.

"రాధాదేవిగారూ! మీరు నాయనమ్మ కాబోతున్నారండీ !"

రాధాదేవి సంతోషానికి అంతులేదు.

"డాక్టరుగారూ! ఇదంతా మీ చలవండీ ! నాజన్మ చరితార్థమయిందండీ!" రాధాదేవి ఆవిడకు ఇవ్వవలసిన దానికంటే ఎక్కువ ఫీజిచ్చి పంపించింది.

"అమ్మా! శిల్పా! తొందరపడి ఏమేమో అన్నాను. నన్ను క్షమించమ్మా!" రాధాదేవి శిల్ప రెండు చేతులూ పట్టుకుంది.

"రఘూతో వెళ్ళిపోవాలనుకుని పొరపాటు చేశాను. ఈవిషయం శేఖర్‌కి తెలిస్తే ఏమనుకుంటాడో? శేఖర్ తండ్రి కాబోతున్నాడని తెలిస్తే తప్పకుండా మారతాడు." సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న శిల్ప అత్తగారి మాటలకి సిగ్గుతో మెలికలు తిరిగింది.

"క్షమించడానికే ముందత్తయ్యా! నేను చేసింది పొరపాటేగా !" శిల్పసోఫాలోంచి లేచి అత్తగారి పాదాలకు నమస్కరించింది.

"నువ్వలా వంగకూడదమ్మా! ఈ రోజు మొదలు నువ్వేపనీ చెయ్యకు, హాయిగా విశ్రాంతి తీసుకో. నాకు వెయ్యేనుగుల బలమొచ్చిందమ్మా ! నాకు దేముడే ప్రత్యక్షమై ఏంకావాలని అడిగితే మనవల్ని చూసుకుంటూ ఇంకో పదేళ్ళు బతకాలని కోరుకుంటానమ్మా!" రాధాదేవి కారే కన్నీళ్ళు కొంగుతో ఒత్తుకుంది. ఆరోజు శేఖర్ అర్థరాత్రి దాటాక ఇంటికి వచ్చాడు. శిల్ప, రాధాదేవికూడా అతని కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

శేఖర్ భోంచేస్తుంటే రాధాదేవి పక్కనే కూర్చుంది. శిల్పలేని ఓపికి తెచ్చుకుని కొసరి కొసరి వడ్డించింది.

జ్యోత్స్నాభిసారికలా తెల్లని వలువలతో తెల్లని జాజిమాలలలతో శిల్ప అలంకరించుకుంది. ఎగిసిపడే హృదయంతో గదిలో అడుగుపెట్టింది. శేఖర్ తలెత్తి ఆమెవైపు చూసి తిరిగి చూపులు మరల్చుకున్నాడు.

పాలపొంగులాంటి శిల్ప ఉత్సాహంమీద నీళ్లుజల్లినట్లయింది. అయినా మనసులోని మాట తొందరచేసింది. మెల్లిగా అడుగులు వేసి మంచం మీద అతనికి దగ్గరగా కూర్చొంది.

"మీరు - మీరు - తండ్రి - " వసంతారంభంలో కొత్త కోయిలలా ఆమె కంఠం పలికింది.

"తెలుసు ! మాఅమ్మ చెప్పింది." ఆమె మాట పూర్తికాకుండానే శేఖర్ కంఠం ఖంగుమంది.

"ఏడు నెలల్లో మన బాబు మన ఒడిలో ఉంటాడు." అతని మాటలు పట్టించుకోకుండా పలికింది.

"బాబూ లేడు ! గీబూలేడు! అప్పుడే పిల్లల వసరంలేదు. పొద్దుటే డాక్టర్ దగ్గర కెళ్ళి అబార్షన్ చేయించుకో!"

పెద్దపులిలా గాండ్రించాడు.

లేడి పిల్లలా బెదురుతున్న శిల్ప శరీరం రోజులాగే శేఖర్ ఆక్రమించుకోబోయాడు.

శిల్ప పగబట్టిన ఆడుత్రాచులా అతన్ని పక్కకు తోసింది. జరజరనడుచుకుంటూ పక్కగదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది,

శేఖర్ కోపంతో ఊగిపోయాడు. శిల్పను ఏమీ చెయ్యలేక తలుపులు మూసుకొని ముసుగెట్టుకు పడుకున్నాడు.

ధైర్యంచేసి శేఖర్‌ని తప్పించుకున్న శిల్ప పరిపరివిధాల ఆలోచించింది.

"ఈ దేశంలో నాలాంటి నిర్భాగ్యపు తల్లు లెందరో ఉన్నారు. అందరిలా నేకాకూడదు. ఇటువంటి తల్లులకు భర్తనెదిరించే ధైర్యంకావాలి. ఎదిరించే శక్తి కావాలి. కోరలుపీకే చాతుర్యం కావాలి. ఒకనాడు ధైర్యంచేసి ఉంటేనాకీ కష్టాలుండేవికావు. రాత్రి నాలుగుగోడల మధ్య చీకటిగదిలో శరీర భాగాలు తడిమే ఆ చెయ్యి పగలు ఆదరించదు. భార్యా భర్తలు శారీరక, మానసిక సుఖాలను సమానంగా పంచుకోవాలనీ తెలీదు. ఈసారి నేను ధైర్యం తెచ్చుకోకపోతే నాగర్భంలో పెరిగే శిశువు నాశనమైపోతుంది. "శిల్ప శేఖర్‌కి దూరంగా ఉండాలని నిశ్చయించుకుంది. ఎప్పుడూ లేవని శేఖర్ ఆరోజు 7 గంటలకే లేచాడు.

"శిల్పా" అతని కంఠం ఖంగుమంది.

"హాస్పిటల్‌కి నడు."

"నే రాదల్చుకోలేదు?" శిల్పమొండిగా సమాధానమిచ్చింది. కోపం పట్టలేని శేఖర్ చెయ్యి పైకెత్తాడు. శిల్పదూరం జరిగింది. కోపంతో మండిపోతున్న శేఖర్ శిల్పను ఒక్కతోపుతోశాడు,-

"అమ్మా!" అంటూ శిల్ప వెళ్ళి కుర్చీ మీద పడింది. పొట్టచేత పట్టుకుని బాధతో మెలికలు తిరిగింది. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్ళింది

రాధాదేవి. శిల్పనాలుగు రోజులతర్వాత ఇంటికి వచ్చింది.

పాలిపోయిన ముఖంతో అచేతనంగా మంచంమీద పడిఉన్న శిల్పను చూసి రాధాదేవి భోరునఏడ్చింది.

"అమ్మా! శిల్పా! నేను చాలా తప్పుపని చేశాను. ఆ రోజే నిన్ను రఘుతో పంపి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదమ్మా! నేనూ అందరిలాంటి మనిషినే! నా స్వార్థానికి నిన్ను గురిచేశానమ్మా! నా తప్పు సరిచేసుకునే అవకాశం నాకియ్యమ్మా!" రాధాదేవి శిల్ప రెండు చేతులూ పట్టుకుని బతిమాలింది."

"ఒకనాడు రఘు నా మనస్సు నిండా వెన్నెల్లా పరుచుకున్నాడు. కాని ఈనాడు నా మనస్సులో రఘు లేడత్తయ్యా!" శిల్ప ఈ మాటలు పైకనలేకపోయింది.

"కొన్ని తప్పులు సరిచేసుకునేవి కావత్తయ్యా! కాలంతోపాటు ముందుకు నడుస్తూనే ఉంటాయి' కంఠం బొంగురుపోయి శిల్ప మాట్లాడలేక పోయింది.

అంతలో శేఖర్ లోపలికి వచ్చాడు.

"శేఖర్ ! నువ్వు చేసిన పనికి శిల్ప జీవితం సర్వనాశనమయిందిరా! ఇంకపిల్లలు పుట్టేఅవకాశం కోల్పోయిందిరా?"

"పీడా విరగడయింది. సుఖంగా ఉండమను.'

"శేఖర్! ఆమెను ఓదార్చడం పోయి ఇవా నీమాటలు? నీ కోసం శిల్పజీవితం సర్వనాశనం చేసానురా? మీనాన్న ఇలా చేసి ఉంటే నువ్వు పుట్టేవాడివికాదురా?"

"నువ్వు నన్ను కనిఉద్ధరించిందేమిటి? నువ్వునన్ను కనకుండా ఉంటే బాగుండేది? " శేఖర్ విసురుగా లోపలికి వెళ్లిపోయాడు.

ఆమాటలకు రాధాదేవి ఉలిక్కిపడింది.

"శేఖర్ మనిషికాదు. కనీనం జంతువుకూడాకాదు. వాటికి కూడా పిల్లల మీద ప్రేమ ఉంటుంది" శిల్ప చీదరించు కుంది.

శిల్ప క్రమంగా కోలుకుంది. రాధాదేవి



## సంబరం

**విజయ:** ఏమండీ! నేను పుట్టింటికి వెళ్తానండి.

**మూర్తి:** చాలా సంతోషం విజయా!

**విజయ:** సంబరపడకండి.... చుట్టుపక్కల వాళ్లందరికీ చెప్పాను... మిమ్మల్ని ఓ కంట కనిపెట్టి ఉండమని.

**మూర్తి:** !!!!!'

**ముద్దా రమణమూర్తి**
(అనంతపురం)

ఆరోగ్యంక్రమంగా క్షీణించడం మొదలుపెట్టింది.

"శిల్పా ! నేనిదిగో అదిగో అన్నట్టున్నాను. ఈ శరీరం నేలరాలకుండానే నీ జీవితం బాగుపడాలి. నువ్వు ఆనందంగా ఉంటేనే నా ఆత్మకి శాంతి. నువ్వు రఘూ దగ్గరకు వెళ్ళిపో ! రేపటినుంచి కొత్త జీవితం ప్రారంభించు".

"ఆ రఘూకి ఎప్పుడో పెళ్ళయిందత్తయ్యా ! అయినా నా మనసులో అతని రూపం ఎప్పుడో చెరిగిపోయింది." శిల్ప ఆ మాటలు ఆవిడతో అనలేకపోయింది.

"ఇప్పుడీ మాటలన్నీ ఎందుకత్తయ్యా!" శిల్ప ఒక చిరునవ్వు నవ్వింది. శిల్ప అలా ఎందుకు నవ్విందో ఆవిడ అర్థం చేసుకునే స్థితిలో లేదు. మాటసన్నగిల్లుతోంది. ఏదో చెప్పాలని నోరు తెరచింది. పెదాలు కదిలాయి. మాటపైకిరాలేదు. కళ్ళు తెరచి శిల్పవైపు చూడాలనుకుంటోంది. కానికంటి రెప్పలు పైకి లేవడం లేదు. ఆవిడ నెమ్మదిగా చేయి చాచింది. శిల్ప ఆవిడ చేతిలో చేయి వేసింది.

"అత్తయ్యా! నువ్వు నీ కొడుకు సుఖంకాకుండా నా సుఖంకోరుకుంటున్నావా?" శిల్ప ఆవిడ మంచితనం భరించలేక వెక్కివెక్కి ఏడ్చింది..

రాధాదేవి కళ్ళు మూతలు పడ్డాయి. శిల్ప కంగారుగా ఆవిడ ఒంటిమీద చెయ్యివేసి చూసింది. చేతికి చల్లగా తగిలింది.

"అత్తయ్యా!" శిల్ప అచేతనంగా అలా కూర్చుండి పోయింది. శిల్పను ఓదార్చేవారు కాదు కదా కనీసం పలకరించేవారుకూడా లేరు.

శేఖర్ తల్లిచనిపోయిందని తెలిసి ఇంటికి వచ్చాడు. తల్లి శవాన్ని చూసి వెక్కివెక్కి ఏడవలేదు. పలకరించలేదు. పలకరించిన చుట్టాలను ఇరుగుపొరుగులను తప్పించుకు తిరిగాడు. శిల్ప కూడా అతనిని పకలరించడానికి ప్రయత్నించలేదు. శేఖర్ తల్లి దహన సంస్కారాలు మాత్రం యధా విధిగా పూర్తిచేశాడు. శిల్ప ఆ ఇంటితో ఋణం తీరిపోయిందనుకుంది.

ఆటోవచ్చి గుమ్మంలో ఆగింది. శిల్ప తాళాలు తీసి శేఖర్ ముందు పెట్టింది.

"శేఖర్! నువ్వెంత అవమానించినా ఊరు కున్నాను. కాని తండ్రికావలసిన నువ్వు కసాయి వయ్యావు. నామాతృత్వానికే ఎసరు పెట్టావు! ప్రేమాభిమానాలు కాలరాశావు. అందుకే నిన్ను క్షమించలేకపోతున్నాను. నన్ను క్షమించు." శిల్ప గొంతు గంభీరంగా ఉంది. శేఖర్ గొంతు మూగపోయింది.

డ్రైవర్ శిల్ప సామాను ఆటోలో పెట్టాడు. శిల్ప వెళ్ళి ఆటోలో కూర్చుంది.

"అమ్మా! లక్ష్మీ దేవిలా తిరిగే దానివి! ఈ ఇంటిని వదిలివెళ్ళి పోతున్నావా అమ్మా!" డ్రైవర్ వెక్కివెక్కి యేడ్చాడు.

"నీపాటి హృదయం ఈ ఇంటి యజమాని కుంటే ఎంతబాగుండేది? ఒకవ్యక్తి మూర్ఖత్వంవల్ల ఎన్ని హృదయాలు విలవిల్లాడుతున్నాయో ఆ వ్యక్తికి తెలియడంలేదు." శిల్ప మనస్సులోనే మధనపడింది.

"రాములూ! నువ్విలా బాధపడి ప్రయోజనం లేదు. ఈ ఇంటిని జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత ఇంకనీదే! నువ్వు ధైర్యంగా ఉండాలి." శిల్ప చిన్నదైనా పెద్ద హృదయంతో చెప్పింది. రాములు తలూపాడు.

రాములు చూడకుండా శిల్ప కళ్ళు తుడుచుకుంది.

శిల్ప ఉద్యోగంలో చేరిందని, లేడీస్ హాస్టల్లో ఉంటోందని వీధివాకిట్లో వికసించిన ఎర్రగులాబీకి తెలిసినట్లుంది గాలికి అటు ఇటు తలాడిస్తూ చిరునవ్వుతో వీడ్కోలు చెప్పినట్లనిపించింది.

"ఇన్నాళ్ళూ నిన్నుచూసి నేను బతికాను. ఇప్పుడు నీ జ్ఞాపకంతోనే బతుకుతాను." శిల్ప గులాబీకి చేయి ఊపింది. ఆటో ముందుకు కదిలింది. ఒంటరివాడైన శేఖర్ ముఖం అవమానం తో వాడిపోయింది. ●

